

ఆకస్మాత్తుగా కుదుపు.. నిద్రలో ఉన్నవారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే బస్సు బోల్తా పడింది. అందులో చిక్కుకున్న వారు అరుపులు, కేకలు పెడుతున్నా.. అర్ధరాత్రి కావడంతో అరణ్య రోదన అయ్యాయి. గాయాలతో హాహాకారాలు చేస్తున్నా.. వినిపించే దూరంలో ఎవరూ లేని ప్రాంతమది. చుట్టూ అలుముకున్న చీకటి, ఎక్కడ ఉన్నారో తెలియదు. ఒకరికొకరు సాయం చేసుకుని బస్సులో నుంచి బయట పడినా.. తమతో వచ్చిన నలుగురు మృతి చెందడంతో వేదనలో మునిగిపోయారు. తీవ్ర గాయాలతో పడి ఉన్న తోటి యాత్రికులను ఆసుపత్రికి తరలించే అవకాశం లేక దీనంగా చూస్తుండిపోయారు. భగవంతుడా.. నీ దర్శనానికని బయల్దేరిన మాకు ఏమిటీ పరీక్షంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

విషాద యాత్ర

- ★ జలేశ్వర్ వద్ద బస్సు బోల్తా
- ★ నలుగురి దుర్మరణం, 16 మందికి గాయాలు
- ★ ఉత్తర్‌ప్రదేశ్ వాసులుగా గుర్తింపు
- ★ పూరీ వస్తుండగా జరిగిన ఘటన

ఉత్తర్‌ప్రదేశ్ నుంచి 57 మంది యాత్రికులతో బయల్దేరిన బస్సు బాలేశ్వర్ జిల్లా జలేశ్వర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జనబిది జంక్షన్ వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, 16 మందికి గాయాలయ్యాయి. వీరంతా సిద్దార్థ్ నగర్ జిల్లాలోని బలరాంపూర్ వాసులని తెలిసింది.



ఘటనా స్థలంలో పొక్లెయిన్‌తో సహాయ కార్యక్రమాలు


ఆలయాల దర్శనానికి బయల్దేరి

ఆలయాలు దర్శనం చేసుకోవాలనుకున్న వీరంతా ప్రైవేటు బస్సులో 18న బయల్దేరారు. వారణాశి, గయా, గంగసాగర్, కోల్‌కతా కాళీమాతను దర్శించుకున్న యాత్రికులు అక్కడ నుంచి జగన్నాథుడి ఆలయానికి పూరీ వస్తుండగా ఈ ఘటన జరిగింది. శాంతారామ్ యాదవ్(59), రాజేష్ కుమార్ మిశ్ర(60), రాజు ప్రసాద్ యాదవ్(57), కమలాదేవి యాదవ్ (62) మృతి చెందారని, 16 మంది క్షతగాత్రులు బాలేశ్వర్ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని ఐఐసీ రంజన్‌కుమార్ శెఠి వెల్లడించారు. అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే స్పందించారని అగ్నిమాపక సిబ్బంది సాయంతో సహాయ చర్యల్లో పాల్గొన్నారని తెలిపారు. దూర ప్రయాణం, అవిశ్రాంత డ్రైవింగ్ వల్ల చోదకుడికి నిద్ర మత్తు ఆవహించి ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానించారు. చోదకుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, కోలుకుంటే కారణం తెలుస్తుందన్నారు. మిగతా వారిని స్వస్థలానికి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్షతగాత్రులను అధికారులు, ప్రజాప్రతినిధులు పరామర్శించి, ధైర్యం చెప్పారు.



చికిత్సపొందుతున్న క్షతగాత్రులు

ప్రతి గింజా కొంటాం



భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఖరీఫ్‌లో 4006 మండీల్లో ధాన్యం సేకరిస్తామని ఆహార పౌరసరఫరాల శాఖమంత్రి కృష్ణ చంద్రపాత్ర్ చెప్పారు. శుక్రవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ... కోటి మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో దళారీల ప్రమేయం ఉండదని, అవినీతి అక్రమాలకు తావు లేదన్నారు. విక్రయించిన 48 గంటల్లో అన్నదాత బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అవుతుందన్నారు. అన్నీ మండీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి గింజా కొనుగోలు చేసి అన్నదాతలకు న్యాయం చేస్తామన్నారు.

వర్సిటీల్లో ఖాళీలను భర్తీ చేస్తాం

మంత్రి సూరజ్ వెల్లడి



భువనేశ్వర్, న్యూస్‌టుడే: త్వరలో వర్సిటీల్లో ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులు భర్తీ చేస్తామని ఉన్నత విద్యా శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ చెప్పారు. శుక్రవారం రాత్రి భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నియామకాలకు సంబంధించి విశ్రాంత ఆచార్యులతో ఒక సంఘం ఏర్పాటు చేసి వారి పర్యవేక్షణలో రాత, మౌఖిక పరీక్షలు చేపడతామన్నారు.

జనజీవన స్రవంతిలో కలవండి

మావోయిస్టులకు ముఖ్యమంత్రి పిలుపు



మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మావోయిస్టులపై ఉక్కుపాదం మోపేందుకు కేంద్ర హోం శాఖ మంత్రి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసిందని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. శనివారం భువనేశ్వర్ లోక్‌సేవాభవన్‌లో జరిగిన అన్ని జిల్లాల ఎస్పీల సదస్సులో మాట్లాడారు. గత నెల 26న హోంమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టుల ఉనికి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలు నియంత్రణలో ఉన్నాయని, ఆయాచోట్ల గాలింపులు ముమ్మరంగా జరుగుతోందన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిస్తే ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. బేఖాతరు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

మీ పెట్టుబడులకు మాది హామీ

'ఉత్కర్ష్ ఒడిశా' కార్యక్రమంలో సీఎం మోహన్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పెట్టుబడులకు ప్రభుత్వం హామీగా ఉంటుందని సీఎం మోహన్ తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపనకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. భువనేశ్వర్ లోక్‌సేవాభవన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో 'ఉత్కర్ష్ ఒడిశా' లోగోను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 2036 నాటికి స్వతంత్ర ఒడిశాగా వందేళ్ల వేడుకలు జరుపుకోనున్న నేపథ్యంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించాలని ధ్యేయంగా పెట్టుకున్నట్లు మోహన్ వెల్లడించారు. '2025 జనవరి 28, 29 తేదీల్లో భువనేశ్వర్‌లో 'ఉత్కర్ష్ ఒడిశా' కార్యక్రమంలో భాగంగా పెట్టుబడిదారుల సదస్సు చేపట్టనున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పారిశ్రామిక సంస్థలను ఆహ్వానిస్తాం. ప్రతి జిల్లాలో ఎంఎస్ఎంఈ, ఎఫ్‌డీఐ పార్కులు, మల్టీ మోడల్ లాజిస్టిక్ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడ, పరిశ్రమల మంత్రి సంపద్ స్వాయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా, ఇతర ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు పాల్గొన్నారు.



లోగో ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ మాఝి, సింగ్‌దేవ్, ప్రభాతి పరిడాలు

వ్యవసాయంలో మహిళలు రాణించాలి



ప్రసంగిస్తున్న దేవాశిష్



సత్కారం అందుకున్న మహిళా రైతులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: వ్యవసాయంలో మహిళలు రాణించాలని నందపూర్ సమితి వ్యవసాయాధికారి దేవాశిష్ నాయక్ అన్నారు. సమితిలోని సింహాద్రి కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన కొరాపుట్ నారీ శక్తి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ నాలుగో వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలను ప్రోత్సహించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేశామని, వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొరాపుట్ ఆర్ఎంసీ కార్యదర్శి అరుణ్ కుమార్ జెనా మాట్లాడుతూ... మహిళా రైతులు ఇంకా వ్యవసాయంలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. పశువైద్యాధికారి శిశిర్‌దాస్ పశు పెంపకంపై చైతన్యాన్ని కలిగించారు. సంస్థ సీఈఓ మంగరాజు దొర ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సహాయ ఇంజినీర్ జేకే బెహరా, గ్రామ పంచాయతీ అధికారి దేవంత మాఝి, సీడీపీవో మినోతి బాలా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుట్టగొడుగులు పంటలో రాణించిన శాంతి బోడో నాయక్, అల్లం పంటలో ఉల్లాస్ కిన్ బుడి, బంగాళదుంప సాగులో రమ గుంటతోపాటు ఉత్తమ మహిళా డైరెక్టర్లుగా మణి బోయి, బసికిలను సత్కరించారు.

ఆనకట్ట ఆశలు ఆవిరేనా..!

- ★ అటకెక్కిన పాణిడొంగరొ ప్రాజెక్టు
- ★ నదీ జలాలు వృథా కావడంతో రైతన్నల్లో ఆవేదన
- ★ భాజపా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినతి

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

రాయగడ జిల్లాలో ఆరు దశాబ్దాల కిందట బీజం పడిన పాణిడొంగరొ ప్రాజెక్టు ఇంతవరకు పట్టాలెక్కకపోవడం అన్నదాతలకు శాపంగా మారుతోంది. జిల్లా మీదుగా ప్రవహిస్తున్న వంశధార నదిపై ఈ ప్రాజెక్టు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇటీవల శాసనసభ సమావేశాల్లో దీని ప్రస్తావన రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గుణుపురం జిల్లా సబ్-డివిజన్ పరిధిలో పాణిడొంగరొ వద్ద వంశధార నదిపై ఆనకట్ట నిర్మించేందుకు 1960లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఇందులో భాగంగా పొరుగు రాష్ట్రం ఏపీ ప్రభుత్వంతో ఒప్పంద పత్రాలపై సంతకం చేసింది. కానీ ప్రయత్నాలు విఫలం కావడంతో మరగున పడిపోయింది. ఇది 2005లో మళ్లీ తెరపైకి వచ్చింది. రుసికుల్యా నదితో వంశధారను అనుసంధానిస్తూ ప్రాజెక్టు నిర్మించేందుకు నిర్ణయించినా పనులు ముందుకు సాగలేదు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్ అప్పట్లో స్పందిస్తూ... గుడారి సమీపంలో ఆనకట్ట నిర్మాణంతో వేలాది మంది అన్నదాతలకు లబ్ధి చేకూరడంతో పాటు వరదల నియంత్రణకు దోహదపడనుందన్న అభిప్రాయం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 25 ఏళ్లుగా పాలించిన బిజద సర్కార్ ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ముఖ్యమంత్రి సానుకూల స్పందన

కేంద్రంతో పాటు రాష్ట్రంలో డబులింజన్ ప్రభుత్వ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు పనులు ప్రారంభమవుతాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో వంశధార నది ప్రవహిస్తోంది. 1962లో హిరమండల(ఏపీ) సమీపాన గొట్టా బ్యారేజ్ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. మాజీ ముఖ్యమంతి బిజు పట్నాయక్ విముఖత చూపడంతో ఏపీ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. అప్పటి కేంద్ర జలవనరుల శాఖ మంత్రి కేఎల్‌రావు ఈ ప్రాంతాన్ని పరిశీలించి రెండు రాష్ట్రాలకు 50 శాతం వాటా నదీజలాలపై ఉంటుదని తీర్మానించినట్లు సమాచారం. దీని ప్రకారం పాణిడొంగరో, గొట్టా బ్యారేజ్ నిర్మాణానికి కేంద్రం అనుమతిచ్చింది. ఏపీలో నిర్మాణం పూర్తి అయినప్పటికీ, ఒడిశాలో మాత్రం ముందుకు కదలలేదు. ఇటీవల శాసనసభలో గుణుపురం ఎమ్మెల్యే **సత్యజిత్ గమాంగ్** ఈ అంశాన్ని లేవనెత్తడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. దీనిపై సీఎం మోహన్ మాఝి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఈ నిర్మాణం పూర్తితో ఇటు రాయగడ జిల్లాలోని గుణుపురం, గుడారితో పాటు గజపతి జిల్లా కాశీనగర్‌కు చెందిన అన్నదాతలకు ఎంతో ప్రయోజనం చేకూరనుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.





సదస్సులో సీఎం మోహన్, ప్రధాన కార్యదర్శి మనోజ్, డీజీపీ ఖురానియా, ఇతర ఉన్నతాధికారులు

త్వరలో 2298 మంది హోంగార్డుల నియామకం

- పోలీసు సిబ్బందికి ద్విచక్ర వాహనాలు
- అన్ని జిల్లాల ఎస్పీల సమావేశంలో తెలిపిన సీఎం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'కొంతమంది పోలీసులు ప్రజలతో ఎలా వ్యవహరిస్తారో తెలుసు, ఆ అనుభవాలు నాకూ ఎదురయ్యాయి. ఓ సారి ఫిర్యాదు చేసేందుకు వెళితే.. ఐఐసీ తిరస్కరించారు'. అని ముఖ్యమంత్రి మోహన్ మాఝి అన్నారు. భువనేశ్వర్ లోక్‌సేవా భవన్ వేదికగా రెండు రోజుల జిల్లాల పాలనాధికారులు, ఎస్పీల సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. శనివారం ముఖ్యమంత్రి ఎస్పీలతో మాట్లాడారు. కొంతమంది వల్ల పోలీసు శాఖ అప్రతిష్ఠ మూట కట్టుకుంటోందన్నారు. అలాంటి వారంతా ఇప్పటికైనా తప్పు తెలుసుకుని బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు.

ఇకపై ప్రతి వారం నివేదిక

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రాత్రి 2 గంటల వరకు లోక్‌సేవా భవన్‌లో పని చేస్తున్నట్లు మోహన్ వెల్లడించారు. అంతవరకూ తనతో కొద్ది మంది అధికారులు ఉంటున్నారని తెలిపారు. నిర్ణీత సమయంలో పని చేస్తామంటే కుదరదని పోలీసు శాఖలోకి వచ్చిన వారు ఏ సమయమైన స్పందించాలన్నారు. ఇటీవల ఓ మహిళపై పోలీసులు చేయి చేసుకున్న ఘటనను ప్రస్తావించిన మోహన్ మాఝి హేయమైన చర్యగా అభివర్ణించారు. ఠాణాల్లో జరిగే కార్యకలాపాల నివేదికలు ఇకపై ప్రతి వారం డీజీపీ వద్దకు వెళ్లాలని ఆదేశించారు.

ఏం కావాలో అడగండి

పోలీసుశాఖను పటిష్ఠం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని. ఏ అవసరమున్నా.. అడగాలన్నారు. త్వరలో 2298 మంది హోంగార్డులను నియమిస్తామన్నారు. అన్ని జిల్లాల్లో ఓడ్రాఫ్ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు సిబ్బందికి ద్విచక్రవాహనాలు అందించడంతోపాటు 10 మెడికల్ కళాశాల ఆసుపత్రుల్లో పోలీసు అవుట్‌పోస్టులు ప్రారంభిస్తామన్నారు. మావోయిస్టుల కాల్పుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పించిన ముఖ్యమంత్రి సమీప భవిష్యత్తు రాష్ట్ర పోలీసు శాఖ ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా మారాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా, డీజీపీ యోగేశ్ బహదూర్ ఖురానియా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




పాల్గొన్న ఎస్పీలు, ఇతర అధికారులు

శాంభవిగా బిరజా అమ్మవారు



ఆశ్వయుజ మాసం పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రముఖ శక్తిపీఠాల్లో తల్లులకు షోడశోపచార పూజలు జరుగుతున్నాయి. శనివారం ఏకాదశి తిథి పురస్కరించుకుని జాజ్‌పూర్ బిరజా అమ్మవారు శాంభవిగా దర్శనమిచ్చారు. కటక్ చండీ దేవి ఉగ్రతార రూపంలో, పూరీ కాకట్‌పూర్ మా మంగళా మాత భువనేశ్వరిగా భక్తులను అలరించారు. శక్తిపీఠాల్లో మహానవమి (అక్టోబరు 11) వరకు ఈ పూజలు జరగనున్నాయి. షోడశోపచార పూజలు, రోజుకో అవతారంలో దర్శనమిస్తారు.

–న్యూస్‌టుడే, భువనేశ్వర్



నాటికతో నవ్విస్తున్న కెవ్వు కార్తీక్ బృందం

'జబర్దస్త్' నటుల సందడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో వైశ్య లేడీస్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అస్కా రోడ్డులోని గ్రీన్ కోర్టుయార్డులో జరిగిన కార్యక్రమంలో 'జబర్దస్త్' నటులు సందడి చేశారు. కెవ్వు కార్తీక్ బృందం తమ స్కిట్‌తో సందడి చేసింది. అసోసియేషన్ ప్రతినిధుల నృత్యాలు, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం కెవ్వు కార్తీక్ మాట్లాడుతూ.. ఒడిశాకు తొలిసారిగా వచ్చానని, నిర్వాహకుల ఆతిథ్యం నచ్చిందని తెలిపారు.



అసోసియేషన్ ప్రతినిధుల ప్రదర్శన

రెండు విడతల్లో పాదయాత్ర

- ★ పార్టీ బలోపేతానికి నవీన్ కసరత్తు
- ★ భాజపా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజదను బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ కసరత్తు చేస్తున్నారు. శుక్రవారం భువనేశ్వర్‌లో శంఖభవన్ (బిజద కార్యాలయం)లో అన్ని జిల్లాల అధ్యక్షులతో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

శాంతి భద్రతలు క్షీణించాయి... శుక్రవారం రాత్రి జరిగిన అధ్యక్షుల సమావేశంలో నవీన్ మాట్లాడుతూ.. 'భాజపా పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయి. మన హయాంలో ఒప్పందం కుదిరిన పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోవడం దురదృష్టకరం. 100 రోజుల పాలనలో అమలు చేస్తామన్న జనహిత కార్యక్రమాలు విస్మరించారు. ఇవి ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని తెలిపారు. అక్టోబరు 2 నుంచి 6 వరకు తొలివిడత. అక్టోబరు 21 నుంచి 30 వరకు రెండో విడత పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. అక్టోబరు 9 ఉత్కళమణి గోపబంధు దాస్ జయంతి నుంచి బిజద సభ్యత్వాల నమోదు కార్యక్రమం జరుగుతుంది. పాదయాత్రలో నవీన్ సైతం పాల్గొంటారని బిజద ఉపాధ్యక్షుడు ప్రసన్న ఆచార్య వెల్లడించారు.




జిల్లాల అధ్యక్షులతో నవీన్ పట్నాయక్

నడవాలంటే నరకమే...



గోతులమయంగా ఇందిరానగర్ మార్గం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ పరిధిలోని రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పారిశుద్ధ్యం, రహదారి, వీధిదీపాలు, మంచి నీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో పురపాలక సంస్థ విఫలమైంది. దీంతో 25 వార్డుల్లో బిజుకాలనీ, సుభాష్‌నగర్, పీహెచ్‌డీ కాలనీ, మాలిగుడ, డీపీక్యాంప్, సిమిలిగుడ పట్టణంలో పెటుకొన్న, సత్యనగర్, కకిగాం, ఇందిరానగర్, కింద ఇందిరానగర్, గాంధీనగర్, కైలాష్ నగర్, ట్రాఫిక్ కూడలి, బస్టాండ్ ప్రాంతంలో మార్గాలు గుంతలతో దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికి వీటిలో నీరు చేరడంతో బురద తుళ్లి పాదచారుల ఇబ్బందులు పడుతున్నారు. మట్టిదారులతో రాకపోకలకు నానాఅవస్థలు పడుతున్నారు. పలు మార్లు ప్రమాదాలు జరిగాయి. ఏళ్లుగా మరమ్మతులు నోచుకోకపోవడంతో పాటు నాణ్యత లోపించడం ఈ దుస్థితికి కారణం. నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్ వద్ద రోడ్డుపై రాళ్లు తేలి వాహనదారులకు, ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. రహదారుల తీరుపై అందరిలోనూ అసంతృప్తి నెలకొంది. దీనిపై పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్ర్ వివరణ కోరగా మరమ్మతులకు, కొత్త రహదారులు నిర్మించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పనులు చేపడతామని హామీ ఇచ్చారు.



అధ్వానంగా తయారైన కైలాష్‌నగర్ దారి

ఝార్ఖండ్‌లో రేపు సీఎం పర్యటన


మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ఉదయం రెండు రోజుల ఝార్ఖండ్ పర్యటనకు వెళ్లనున్నారు. భాజపా కేంద్ర నాయకత్వం చేపట్టనున్న పరివర్తన యాత్రలో ఆయన పాల్గొననున్నారు. నవంబరులో పొరుగు రాష్ట్రం ఝార్ఖండ్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భాజపా నాయకత్వం విజయమే ధ్యేయంగా గట్టి కసరత్తు ప్రారంభించింది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను ఇన్‌ఛార్జిగా నియమించింది. ఒడిశా గవర్నరు రఘుబర్‌దాస్ లోగడ ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం భువనేశ్వర్ వచ్చిన బిశ్వశర్మ రఘుబర్‌తో గోప్యమంతనాలు జరిపిన విషయం తెలిసిందే. ఝార్ఖండ్‌లో ఒడియా ప్రజలు 18 శాతం మంది ఉన్నారు.

వరదలకు దెబ్బతిన్న పూలసాగు
ఆవేదనలో రైతులు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: అధిక వర్షాలు, వరదలు, వాతావరణంలో మార్పు, ప్రతికూల పరిస్థితులతో పూల సాగు దెబ్బతింది. పశ్చిమ మిద్నాపూర్, తూర్పు మిద్నాపూర్ జిల్లాల్లో ఈ సాగు లాభసాటి వ్యాపారం. ఈ ఏడాది బాగా దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సాగు అధిక శాతం నాశనమైంది. తూర్పు మిద్నాపూర్ జిల్లా పంచుకురాలో అధికంగా వరదలు సంభవించి నీట మునగడంతో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. దీంతో మార్కెట్లో పూల కొరత మొదలైంది. దుర్గపూజల సందర్భంగా మంచి గిరాకీ ఉంటుందని సరైన సమయంలో వరుణుడి ఉగ్రత చూపించాడని పశ్చిమ బెంగాల్ పూల విక్రేతల సంఘం కార్యదర్శి నారాయణ చంద్ర నాయక్ తెలిపారు.

న్యాయస్థానంలో ఉచిత వైద్య శిబిరం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పర్లాఖెముండి పట్టణంలోని జిల్లా న్యాయస్థానంలో శ్రీకాకుళం జిల్లా జెమ్స్ ఆసుపత్రి ఆసుపత్రి వైద్య బృందం శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా న్యాయమూర్తి ప్రణబ్ కుమార్ రౌత్రయ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. కార్డియాలజీ వైద్యులు ఎల్‌కె విజయ్‌కుమార్, విప్రియ, సురేంద్రకుమార్ చౌదరి, ఏరియా మేనేజర్ అనిల్, సత్య పాల్గొన్నారు.

ఆ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా జిల్లా హెడ్‌క్వార్టర్, సబ్ డివిజనల్, సామాజిక, ప్రాథమిక తదితర ఆరోగ్య కేంద్రాల్లో దీర్ఘకాలంగా సేవలందిస్తున్న జీఎన్‌ఎం, ఎఎన్‌ఎంలను తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని ఒడిశా పొరుగు సేవల నర్సింగ్ ఉద్యోగుల సంఘం డిమాండు చేసింది. ఆ సంఘం గంజాం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గంజాం కళా పరిషత్ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించింది. సంఘం ప్రతినిధులు ప్రతాప్ ప్రధాన్, రింకి బిశోయి, సంతోష్ నాయక్ పాల్గొని మాట్లాడారు. ఇటీవల గంజాం, గజపతి, రాయగడ, కొంధమాల్, జగత్సింగ్‌పూర్, బాలేశ్వర్ తదితర జిల్లాల్లో కొందరు జీఎన్‌ఎం, ఎఎన్‌ఎంలను తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నాయని వారిని పునర్నియమించాలని కోరారు.


విలేకరుల సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

ఆదివాసీ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ


ఎంపికైన విద్యార్థులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే; రాయగడ జిల్లా కొలనరా సమితిలో తెరువళిలోని ఇంఫా పరిశ్రమ పేద ఆదివాసీ విద్యార్థులకు కంప్యూటర్ విద్యకు సంబంధించి ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నారు. శనివారం సమితి ఉపాధ్యక్షుడు హలధర హిమిరిక చేతులు మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐటీఐ కేంద్రంలో వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. కొల్నార సమితిలో తెరువళి, కార్తిగూడ, కిల్లిగూడ, కెధపడ, డుమిరిగూడ పంచాయతీలకు చెందిన నలభై మంది విద్యార్థులను ఎంపిక చేశారు. పరిశ్రమ పల్లె వికాశ్ నిర్వాహకుడు రాధశ్యామ్ పండా నాలుగు నెలలు తర్ఫీదు ఇస్తామని తెలిపారు. కంపెనీ అధికారి (పీఆర్‌వో) శక్తి పాణిగ్రహి, సర్పంచులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధానోత్సవాలు



లంజిపల్లి రామ్‌నగర్ రెండో లైను లోని శ్రీ షిరిడీ సాయి మందిరంలో శనివారం 'ఆరాధనోత్సవాలు' భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజలు, శ్రీ సాయి సత్యవ్రతాలు, మధ్యాహ్న హారతి జరిగింది. అనంతరం భక్తులకు నారాయణ సేవ ఏర్పాటు చేశారు.

– న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

ఉరేసుకుని బలవన్మరణం

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ ఉమర్‌కోట్ ఠాణా పరిధిలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఉమర్‌కోట్ ఠాణా పరిధిలో హిరాపూర్ పంచాయతీ జాముగండ యువి-13 గ్రామానికి చెందిన సనోజ్‌రాయ్(36) ఇంట్లో ఎవరు లేని సమయంలో పంకాకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చూసి ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్సై రఘునాథ్ మాఝి మృతికి గల కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామన్నారు.

నదిలో మహిళ గల్లంతు

సిమిలిగుడ, ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: నందపూర్ సమితి కూలర్ సింగ్ పంచాయతీకి బడెల్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ పాతాళి నదిలో మునిగి గల్లంతైంది. ఠాణా ఏఎస్ఐ దీపక్ కుమార్ బారిక్ అందించిన వివరాల ప్రకారం...బడెల్ గ్రామానికి చెందిన రాధ కోరా(35) శనివారం ఉదయం గ్రామం సమీపంలోని పాతాళి నదికి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో మునిగిపోయింది. ఆమె ఎప్పటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు నది వద్దకు వెళ్లి చూడగా దుస్తులను చూసి మునిగిపోయినట్లు భావించారు. తక్షణమే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం లభ్యం కాలేదు. నది వద్దకు చేరుకొని మృతదేహం కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. సాయంత్రం వరకు మృతదేహం లభ్యం కాలేదు.


నది లో గాలింపు చర్యలు చేస్తున్న దృశ్యం

● నదిలో స్నానానికి వెళ్లిన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు గల్లంతయ్యారు. వివరాల్లోకి వెళ్తే ఝూర్ గ్రామ్ జిల్లా జాంబోనీ పరిధిలోని బని తీర్థ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది 12వ తరగతి విద్యార్థులు శుక్రవారం డులుంగ్ నదిలో స్నానానికి వెళ్లారు. ఇందులో ఇద్దరు నీట మునిగి చనిపోయారు. మృతులు బద్మా ప్రాంతానికి చెందిన సోలార్ కుమార్ మాఝి, అంకుష్ హతాయిలుగా గుర్తించారు.

ఉక్కు కర్మాగారంలో పేలుడు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రవుర్కెలా ఉక్కుకర్మాగారం (అరెస్పీ) ఎస్‌ఎంఎస్ యూనిట్-1లో శనివారం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఓ అధికారి, మరో 5 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్ని యంత్రాంగం సమీపంలోని ఆర్‌జీ ఆసుపత్రికి తరలించింది. భద్రతా వైఫల్యమే కారణమని కార్మిక సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

ఢీకొన్న ద్విచక్రవాహనాలు.. నలుగురికి తీవ్ర గాయాలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లాలో ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే జిల్లాలోని గుమ్మ సమితిలో తోహజింగ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. పర్లాఖెముండి నుంచి గుమ్మ వైపు వస్తున్న ద్విచక్రవాహనం అటుగా వస్తున్న మరో వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు తరంగడ పంచాయతీ తోహజింగ్ గ్రామానికి చెందిన ఆయిబో రైతుతో, గలియా రైత్, జోదూరు గ్రామానికి చెందిన సిద్ధాంత రైత్, అంతరంగ్ గ్రామానికి చెందిన ప్రేమా బుయ్యన్‌లుగా తెలుస్తోంది. వీరిని ఆసుపత్రిలో చేర్చగా పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం బ్రహ్మపుర, శ్రీకాకుళం ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ఒక్క అంబులెన్సు లేకపోవడం గమనార్హం. ఈ విషయంపై అదనపు వైద్యాధికారి ప్రమోద్ కుమార్ పండా వద్ద ప్రస్తావించగా ఆయన వద్ద నుంచి సరైన సమాచారం దొరకలేదు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

● గజపతి జిల్లా మోహన ఠాణా పరిధిలోని చందిపుట్ గ్రామంలో శనివారం ఉదయం వ్యాన్ ఢీకొని కార్మికుడికి గాయాలయ్యాయి. తోటి కార్మికులు క్షతగాత్రునికి మోహన ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం బ్రహ్మపుర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహన చోదకుడుని అదుపులోకి తీసుకున్నారు. బాధితుడు డేంగామా గ్రామానికి చెందిన లక్ష్మీ గౌడ్‌గా గుర్తించారు.

భువనేశ్వర్‌లో సైబర్ వర్సిటీ శాఖ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయం శాఖను ఏర్పాటు చేయనుంది. వర్సిటీ ప్రతినిధి బృందం శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని కలిసి చర్చించారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు పెరుగుతుండటంతో యువతకు సమగ్ర అవగాహన కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

మహిళా రైతుపై తేనేటీగల దాడి

రాయగడ గ్రామీణం,న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కల్యాణ సింగుపూర్ సమితి పటబందలో చికను కద్రక(35) అనే మహిళా రైతుపై శుక్రవారం సాయంత్రం తేనేటీగలు దాడి చేశాయి. ఆమె తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్చారు. పొలం పనులు చేసుకుని ఇంటికి వస్తుండగా ఈ ఘటన జరిగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భగత్ సింగ్ జయంతి శనివారం పలు సంస్థల ఆధ్వర్యంలో వివిధ చోట్ల జరిగాయి. ● వందే ఉత్కళ సమాజ్ ట్రస్ట్ పాణిగ్రహిపెంఠొ వీధిలో ఉచితంగా ఆరోగ్య, నేత్ర పరీక్షల శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే అనిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ● మానవ అధికార్ సురక్షా మంచ్, అఖిల భారత యువ సంఘం (ఎఐవైఎఫ్)ల ఆధ్వర్యంలో జరిగాయి.

రూ. లక్ష పలికిన వినాయకుడి లడ్డూ

రాయగడ, న్యూస్‌టుడే: పట్టణంలో బుదరా వలస వీధిలో వినాయక చవితి మహోత్సాల్లో 21 రోజులు ఘనంగా జరిగాయి. అనుపోత్సవం సందర్భంగా జరిగిన లడ్డూ వేలం పాటలో రింగ్ రోడ్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆర్ శంకర్ రెడ్డి రూ .లక్ష పదకొండు వేల ఒక్క రూపాయికి దక్కించుకున్నాడు.


హర్షం వ్యక్తం చేస్తున్న శంకర్‌రెడ్డి (టోపీ పెట్టుకున్న వ్యక్తి)

బీఎస్‌ఎఫ్ ఆయుధ ప్రదర్శన

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ సమితి రామగిరిలో శనివారం 180 బెటాలియన్ బీఎస్‌ఎఫ్ తరపున ఆయుధాలతో పాటు శునకాల నైపుణ్య ప్రదర్శన జరిగింది. వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా, జవాన్లు వారికి వివరించారు.


తుపాకీని ఉపయోగించే విధానం విద్యార్థులకు వివరిస్తున్న జవాను

స్వామినాథన్‌కు నివాళి

జయపురం, న్యూస్‌టుడే: స్వామినాథన్ ఫౌండేషన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధినేత ఎమ్.ఎస్. స్వామినాథన్ మొదటి వర్ధంతి కార్యక్రమం శనివారం జయపురం రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది. డైరెక్టర్ ప్రశాంత్ పరిడా అధ్యక్షతనలో పలు గ్రామాలకు చెందిన కర్షకులు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ నేతలు నివాళ్లు అర్పించారు.


కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

కొరాపుట్ జిల్లా నేతలతో నవీన్ ప్రత్యేక సమావేశం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మళ్లీ బిజూ జనతాదళ్ పార్టీ అధికారంలోకి రావాలంటే నేతలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని బిజద రాష్ట్ర అధ్యక్షులు నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆదివాసీ ప్రభావిత ప్రాంతాలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, నేతలు కార్యకర్తలతో భువనేశ్వర్‌లో ఉన్న శంఖ భవనంలో శనివారం నవీన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.


నవీన్ పట్నాయక్‌తో అవి భక్త కొరాపుట్ జిల్లా నేతలు

పుంజుకున్న పర్యాటక రంగం


వేదికపై గవర్నరు రఘుబర్ దాస్, సభాపతి సురమాపాఢి, ఇతర ప్రతినిధులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఉపాధికి బాటలు వేస్తున్న పర్యాటక రంగం ఇటీవల కాలంలో పుంజుకుందని గవర్నరు రఘుబర్ దాస్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రాత్రి భువనేశ్వర్‌లో రాష్ట్ర టూరిస్ట్‌గైడ్ సంఘం, పర్యటక, సాంస్కృతిక శాఖలు సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శాసనసభాపతి సురమాపాఢి, రాష్ట్ర హోటల్ సంఘం అధ్యక్షుడు జె.ఎన్.మహంతి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

సబర్మతి ఆశ్రమంలో అపరాజిత



భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి శనివారం గుజరాత్ అహ్మదాబాదులోని సబర్మతి ఆశ్రమం సందర్శించారు. బాపూజీ మ్యూజియం, గ్రంథాలయం తిలకించారు. రాట్నంలో నూలు వడికారు. ఆశ్రమ పెద్దలతో ముచ్చటించారు.

–న్యూస్‌టుడే, భువనేశ్వర్

టీటీలో మెరిసిన యువకిరణం

బ్రహ్మపుర క్రీడలు, జయపురం, న్యూస్‌టుడే: సౌదీ అరేబియాలో జరిగిన డబ్ల్యూటీటీ అండర్-15 బాలుర అంతర్జాతీయ టేబుల్‌టెన్నిస్ పోటీల్లో రాష్ట్రానికి చెందిన సార్థక్ ఆర్య సింగిల్స్, డబుల్స్‌లలో రెండు పసిడి ట్రోఫీలు దక్కించుకున్నాడు. సింగిల్స్ తుదిపోరులో సార్థక్ 3-1 సెట్లతో చైనా క్రీడాకారుడిపై గెలుపొందాడు. అనంతరం డబుల్స్ ఆడి స్వర్ణం ఖాతాలో వేసుకున్నాడు. రాష్ట్ర టేబుల్‌టెన్నిస్ సంఘం ప్రతినిధులు, రాష్ట్ర క్రీడావిభాగం అధికారులు అభినందనలు తెలిపారు.


సాధించిన స్వర్ణాలతో సార్థక్ ఆర్య

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రజతం: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన జాతీయ పోలీస్ శాఖ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బొయిపరిగూడకు చెందిన శిఖామహంతి రజత పతకం సాధించింది. ఈ నెల 23వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. 68 కిలోల విభాగంలో ఆమె ఈ ఘనత సాధించింది.

వంతెన నిర్మాణం జరిగేనా?



నవరంగపూర్ జిల్లా నందహండి సమితి మెంత్రి పంచాయతీ బరగావ్ - దిగి గ్రామాల మధ్య వాస్కెల్ కాలువపై వంతెన గతేడాది వర్షాలకు ధ్వంసమైంది. దీంతో ఎనిమిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని బీడీవో శివశంకర్ తెలతిపారు. –న్యూస్‌టుడే, జయపురం.

స్తంభించిన వైద్యసేవలు

బ్రహ్మపుర నగరం, నవరంగపూర్, రాయగడ పట్టణం, మునిగుడ,పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ఉద్యోగోన్నతి కల్పించడంతో పాటు న్యాయమైన పది డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నర్సింగ్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. ఒడిశా నర్సింగ్ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఆయా ఆసుపత్రిల వద్ద నిరసన చేపట్టారు.


బ్రహ్మపుర: ఎమ్కేసీజీ ఆవరణలో ఆందోళన చేస్తున్న సిబ్బంది

మత్స్య రైతులకు ముగిసిన శిక్షణ

జయపురం, న్యూస్‌టుడే: జయపురంలో ఎమ్.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తరఫున రాష్ట్ర జాతీయ వ్యవసాయ అభివృద్ధి ప్రణాళిక నేతృత్వంలో కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ సమితి, నవరంగపూర్ జిల్లా కొసగుముడ సమితికి చెందిన రైతులకు మత్స్యసాగుపై నిర్వహిస్తున్నా రెండు రోజుల శిక్షణ శిబిరం శనివారంతో పూర్తయింది. శిక్షణలో ఉన్న మొత్తం 161 మంది రైతులకు చేపపిల్లలను అందజేశారు.


రైతులతో మాట్లాడుతున్నా సిమాంచల్‌పాఢి

టీ-20 క్రికెట్ పోటీలకు మహిళా జట్టు పయనం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: నాగ్‌పూర్‌లో ఈ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు జరగనున్న మహిళల అండర్-19 టీ-20 ట్రోఫీ క్రికెట్ పోటీలకు రాష్ట్ర మహిళా జట్టు సిద్ధమైంది. ఈ మేరకు ఎంపికైన జట్టు క్రీడాకారిణులు శనివారం నాగ్‌పూర్‌కు పయనమయనట్లు ఒడిశా క్రికెట్ అసోసియేషన్ (ఓసీఏ) ప్రతినిధులు సాయంత్రం 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ● చండీగఢ్‌లో శుక్రవారం జరిగిన ఐటా జాతీయ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారుడు దేబాసిస్ సాహు టైటిల్ గెలుచుకున్నాడు. ఇందులో పురుషుల సింగిల్స్ తుదిపోరులో దేబాసిస్ 6-2 సెట్లతో శంకర్ హైసినమ్ (మణిపూర్)పై గెలుపొంది విజేతగా నిలిచాడు. ● మహరాష్ట్రలోని నాసిక్‌లో ఇటీవల జరిగిన భారత తైక్వాండో ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ అంతర్జాతీయ ట్రయల్ పోటీల్లో బ్రహ్మపుర బాలలు ఆరు పతకాలు దక్కించుకున్నారు. విక్టరీ అకాడమీ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ తరపున బాలలు పోటీల్లో పాల్గొన్నారని కోచ్ వి.సతీష్‌కుమార్ రావు చెప్పారు. ఆయన శనివారం 'న్యూస్‌టుడే'కు వివరాలు వెల్లడించారు. 3 పసిడి, రెండు రజతం, ఒక కాంస్యం సాధించారు. క్రీడాకారులను శుక్రవారం బ్రహ్మపుర సబ్‌కలెక్టరు దీనా దస్తగీర్ అభినందించారు.


ఎంపికైనా క్రీడాకారులతో శిక్షకురాలు, మేనేజర్లు

చిన్నారులకు హృద్రోగ పరీక్షలు

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలలో శనివారం 114 మంది చిన్నారులకు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. హృద్రోగ నిపుణులు డా.సుప్రతిమ్ అధ్వర్యంలో ఈ పరీక్షలు జరిగాయి.


శిబిరానికి హాజరైన చిన్నారులు

కరిరాజుల అలజడి

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝూర్ గ్రామ్ జిల్లా సువర్ణరేఖ నది దాటి 45-50 ఏనుగులు సంకరాయిల్‌లో శనివారం ప్రవేశించాయి. అటు నుంచి గర్బారా గ్రామంలో ప్రవేశించి పంట పొలాలను ధ్వంసం చేశాయి. తపోవనం ప్రాంతంలోని నయాగ్రామ్‌లో ఇదే పరిస్థితి చోటు చేసుకుంది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


ధ్వంసమైన పంట పొలాలు

అవీ..ఇవీ..అన్నీ


చెరువు శుభ్రం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భాజపా నాయకులు ఎమ్మెల్యే అనిల్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బెజ్జిపురంలోని సున్నారి బొంధో పరిసరాల్లోని మొక్కలు, ఇతరత్రా వ్యర్థాలు తొలగించారు.

ఉత్సాహంగా సురభి పోటీలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా బొయిపరిగూడ సమితి మహోలి ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన క్లస్టర్ స్థాయి సురభి పోటీలకు ముఖ్య అతిథిగా బీఈవో ప్రఫుల్లా కుమార్ పట్నాయక్ హాజరయ్యారు. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను, ప్రశంసాపత్రాలను అందజేశారు.

పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరి


ర్యాలీ చేస్తున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: తమ ఇంట్లో పెంచుకొనే పెంపుడు శునకాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం విద్యార్థులు అన్నారు. శనివారం ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్లకార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. పశువైద్య పాఠశాల జంతు శాస్త్రాలు డీన్ రాజ్ కిషోర్ స్వయిన్, వ్యవసాయ, మత్స్యశాఖ కులపతి డాక్టర్ ఎస్ పీ నంద, పశు వైద్య నిపుణులు ఎంజీ జయతంగ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భాష, లిపిని పరిరక్షించాలి


సమావేశంలో పాల్గొన్న గిరిజనులు

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడజిల్లా గిరిజనుల భాష, సంస్కృతి, లిపిని పరిరక్షించడానికి, గిరిజనుల్లో చైతన్యం తీసుకురావాలని ప్రముఖులు అభిప్రాయ పడ్డారు. శనివారం గుణుపురం సమితి సిద్ధంగుడలో జరిగిన సమావేశంలో 12 గ్రామాలకు చెందిన గిరిజన పెద్దలు పాల్గొన్నారు. ఆదివాసీ భాష, లిపిని విద్యాలయాల్లో పాఠ్యాంశంగా చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్లు తెలిపారు.


వ్యర్థాల తొలగింపు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం అపరిశుభ్రంగా ఉండడంతో పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్ర నేతృత్వంలో ఉపాధ్యక్షురాలు రీతు కంట, కార్యనిర్వాహక అధికారి నారాయణ నాయక్ తదితరులు వ్యర్థాలు తొలగించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ..

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఉప్పలాడలోని ప్రభుత్వ ఠాగూర్ మెమోరియల్ ఉన్నత పాఠశాల్లో సమితి స్థాయిలో జరిగిన రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని సమితి అదనపు విద్యాధికారి ఎన్. విమల్ తెలిపారు. ఇతర అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి


నరేంద్ర పాఢి

నవరంగపూర్, న్యూస్‌టుడే: ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 103 సార్లు రక్తదానం చేసి చాలామంది ప్రాణాలను కాపాడి అందరి ప్రశంసలు పొందుతున్నారు నవరంగపూర్‌కు చెందిన విశ్రాంతి ఎయిర్ ఫోర్స్ అధికారి నరేంద్రపాఢి తాను ఆర్మీలో పనిచేస్తున్నప్పుడు మొదటి సారి ఐదేళ్ల చిన్నారికి రక్తదానం చేసి ఆమె ప్రాణాలు కాపాడానని తెలిపారు. అప్పటి నుంచి ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నాని, ఎవరికైనా అత్యవసర పరిస్థితిలో రక్తం కావాలంటే అందిస్తానని, ప్రాణం పోయేంత వరకు ఈ పని చేస్తానని అన్నారు. ఆయన మానవత్వానికి పలువురు అభినందిస్తున్నారు.

ఆలోచనొచ్చింది.. ఆవిష్కరణ మెరిసింది

వాహనాల తయారీలో యువకుడి ప్రతిభ

ఆ కుర్రాడి దృష్టి పడితే.. పాత వాహనాలు రయ్‌మంటూ పరుగులు తీస్తాయి.. సాంకేతిక పరిజ్ఞానానికి సృజన తోడై.. పర్యావరణానికి హాని చేకూర్చని విద్యుత్తు, సౌరశక్తితో నడిచే వాహనాలు దర్శనమిస్తాయి.. తక్కువ ఖర్చుతో వివిధ వాహనాలను తయారు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు బొబ్బిలి మండలంలోని మెట్టవలసకు చెందిన ఉంగట్ల శంకరరావు.

– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం



ఇలా అడుగులు..



కలుపుతీత యంత్రం

బొబ్బిలి ఐటీఐలో శంకరరావు ఎలక్ట్రికల్ కోర్సు చేసి దూరవిద్య ద్వారా డిగ్రీ చదివాడు. తొలుత కూలీలు సమయానికి దొరక్కపోవడం, కూలి రేట్లు పెరిగిపోవడం తదితర సమస్యల్ని గుర్తించి సౌరశక్తితో పని చేసే కలుపుతీసే యంత్రాన్ని తయారు చేశాడు. పాత సైకిల్‌ను సేకరించాడు. నాలుగు చక్రాలు అమర్చాడు. దానికి సౌర పలక ఏర్పాటు చేశాడు. యంత్రం నడపడానికి హ్యాండిల్ కూడా ఇనుప రాడ్లతో తయారు చేశాడు. 24 వాట్ల మోటారు అమర్చాడు. సూర్యరశ్మి లేనప్పుడు ఛార్జింగ్ చేసుకోవడానికి పరికరాలు బిగించాడు. రెండు గంటల పాటు ఛార్జింగ్ చేస్తే దాదాపు 5 గంటలపాటు పనిచేసేలా రూపొందించాడు. అయిదు రోజులపాటు కష్టపడి రూ.2 వేలతో తయారు చేశానని, దీనివల్ల ఎకరానికి రూ.3 వేల వరకు ఆదా అవుతుందని చెబుతున్నాడు.

విద్యుత్తు వాహనం..



విద్యుత్తు వాహనం

వాయు కాలుష్యాన్ని నివారించడానికి విద్యుత్తుతో పనిచేసే చిన్న ద్విచక్ర వాహనాన్ని రూపొందించాడు. పాత ఎక్సెల్ వాహనం, ఇతర సామగ్రితో 24 వాట్ల సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఏర్పాటు చేశాడు. 35 వాట్ల సామర్థ్యం కలిగిన మోటారు అమర్చాడు. రెండు గంటల పాటు ఛార్జింగు పెడితే 25 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయవచ్చని చెబుతున్నాడు. రూ.5 వేలు ఖర్చు చేసి, వారం రోజుల పాటు కష్టపడి తయారు చేశానని పేర్కొన్నాడు.

బ్యాటరీ సైకిల్

బ్యాటరీతో నడిచే వినూత్న సైకిల్‌ను తయారు చేశాడు. దీనికోసం రూ.5 వేలు వెచ్చించి 15 రోజులు కష్టపడినట్లు చెప్పాడు. 24 వాట్ల బ్యాటరీ, అంతే సామర్థ్యం ఉన్న మోటారు అమర్చాడు. సైకిల్‌ను నియంత్రించడానికి 30 హార్స్ పవర్ కలిగిన యంత్రాన్ని ఏర్పాటు చేశాడు. నాలుగు గంటలపాటు ఛార్జింగు పెడితే 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చని, గంటకు 35 కి.మీ వేగంతో నడుస్తుందని పేర్కొంటున్నాడు శంకరరావు.

సరికొత్త కారు

డీజిల్, పెట్రోల్ అవసరం లేకుండా కేవలం బ్యాటరీతో నడిచే కారును రూపొందించాడు. నెల రోజులు కష్టపడి సుమారు రూ.50 వేలు వెచ్చించి, దీన్ని తయారు చేశాడు. సమీపంలోని గ్యారేజీ నుంచి పాత చక్రాలు, టైర్లు, ఇంజిన్ సేకరించాడు. పాత జింక్ రేకులతో కారు పైకప్పు ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వెల్డర్ సాయం తీసుకున్నాడు. 48 వాట్ల సామర్థ్యం ఉన్న నాలుగు బ్యాటరీలను అమర్చాడు. ముందుకు, వెనక్కి వెళ్లడానికి వీలుగా గేరు మోటారు బిగించాడు. కారులో నలుగురు కూర్చోవడానికి వీలుగా రెండు వరుసల్లో సీట్లు ఏర్పాటు చేశాడు. గంటపాటు ఛార్జింగు చేస్తే 30 కి.మీ దూరం వెళ్తుందని శంకరరావు అంటున్నాడు. దీనినే ప్రస్తుతం బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, సాలూరుకు వెళ్లడానికి ఉపయోగిస్తున్నానన్నారు. గతంలో పిచికారీ చేసే యంత్రం, బావి నుంచి పొలాలకు నీరు తోడే యంత్రం కూడా తయారు చేశాడు.



తయారు చేసిన కారు

ఆలయాల్లో ఏకాదశి పూజలు



పుష్పాలంకరణలో బలిజిపేట శ్రీనివాసుడు

బలిజిపేట, న్యూస్‌టుడే: బలిజిపేట శ్రీవేంకటేశ్వర స్వామి, చిలకలపల్లి వేణుగోపాల స్వామి ఆలయాల్లో అర్చకులు జేబీ హరికృష్ణమాచార్యులు, కె.రాంబాబు ఏకాదశి పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాల అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.

అబ్కారీ అధికారుల్ని ముట్టడించిన గ్రామస్థులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా మెరైన్ ఠాణా పరిధిలోని సున్నాపురం గ్రామంలో శనివారం జిల్లా అబ్కారీ, నిషా విభాగం అధికారులు సారా అక్రమ తయారీ, అమ్మకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై దాడులు చేశారు. ఒకర్ని అదుపులోకి తీసుకుని, అతడ్ని వాహనంలో తరలిస్తున్న సమయంలో పలువురు మహిళలు, పురుషులు అధికారుల వాహనాన్ని ముందుకు కదలనీయకుండా అడ్డుకుని, వారిని ముట్టడించారు. వారు ఎంత నచ్చజెప్పినా, గ్రామస్థులు పట్టువీడలేదు. దీనితో పరిస్థితి స్వల్ప ఉద్రిక్తంగా మారడంతో సమాచారం అందుకున్న మెరైన్ ఠాణా అధికారులు అక్కడకు చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పారు.

శీఘ్రమేవ దర్శన ప్రాప్తిరస్తు..!

- ఆటంకాలు తొలగిస్తే సాఫీగా అమ్మవారి దర్శనం
- 1 నుంచి కొత్తమ్మతల్లి జాతర



కొత్తమ్మతల్లి

న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కోరిన వరాలిచ్చే తల్లిగా... భక్తుల పాలిట కల్పవల్లిగా ప్రసిద్ధికెక్కిన కొత్తమ్మతల్లి ఉత్సవాలను ఈ ఏడాది ప్రభుత్వం రాష్ట్ర పండగగా నిర్వహిస్తోంది.. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మూడు రోజుల పాటు జాతర జరగనుంది. అమ్మదర్శనానికి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఏటా వచ్చేవారికి పలు సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. క్యూలైన్లు కిక్కిరిసి ఉండటం, నిర్వహణ లోపాలు, కొత్తపేట-కోటబొమ్మాళి ప్రధాన రహదారిపై కిలోమీటర్ల మేర భక్తులకు నిరీక్షణ తప్పట్లేదు. ప్రతిఒక్కరూ ఆటంకాలు లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. వారి సూచనల్లో కొన్ని..

ఇవి చేస్తే మేలు..

- దర్శన క్యూలైన్లలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడకుండా పాలు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి. స్వచ్ఛంద సేవలందించేవారికి అధికారులు తోడ్పాటునివ్వాలి.
- పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులతో కిలోమీటర్లు దాటి క్యూలైన్లు ప్రధాన రహదారిపైకి వస్తాయి. ఈ సమయంలో ఎండ ధాటికి భక్తులు ఇబ్బందులు పడతారు. ఎండ నుంచి రక్షణగా టెంట్లు, కింద పరదాలు వేయాలి.
- కోటబొమ్మాళి మార్గంలో ఉన్నదాంతో పాటు కొత్తవైపు కూడా పాదరక్షలు భద్రపరిచేందుకు సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- మూడోరోజు (గురువారం) లక్షల్లో జనం వస్తారు. పలువురు గర్భగుడి వద్ద శీఘ్రదర్శనం కోసం రక్షణ గోడలపై నుంచి అవుట్‌గేట్ ద్వారా వస్తున్నారు. దీనివల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని పరిష్కరిస్తే బాగుంటుంది.
- వీఐపీల పేరుతో నిబంధనలు అతిక్రమించి కొందరు ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు. వీరిని పోలీసులు, ఆలయ నిర్వాహకులు వదిలేస్తున్నారు. దీనివల్ల అప్పటికే వేచి ఉన్న భక్తులకు అసౌకర్యం కలగడంతో పాటు ఆదాయానికి గండి కొడుతున్నారు.
- అమ్మవారి గర్భగుడి భక్తులు సమర్పించే ముర్రాటల నీటితో నిండిపోతుంటుంది. వెంటనే తొలగించి, ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి.
- ఉత్సవాల్లో తప్పిపోయిన వారి ఆచూకీ ఆలయంలో కాక ఆరుబయట ఆలయం ముందు పోలీసు కంట్రోల్‌రూం వద్ద చెప్పేలా ఉంటే మేలు.
- కొత్తపేట నుంచి కోటబొమ్మాళి వైపు ఎర్రన్నాయుడు పార్కు వరకు రహదారిపైకి కాక కొంతమేర లోపలకు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తే రద్దీ నియంత్రించవచ్చు.
- వాహనాల పార్కింగ్‌కు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందుగానే చర్యలు చేపట్టాలి.
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన రహదారి కాకుండా కోటబొమ్మాళి-మంచాలపేట రహదారిని ప్రత్యామ్నాయ మార్గంగా పరిశీలించవచ్చు.
- మొదటి రోజు, మూడోరోజు భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసుల సంఖ్య మరింత పెంచాలి.
- దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాల కేంద్రాలను రెండు,మూడుచోట్ల పెట్టాలి. అవుట్‌గేట్ వద్ద పెట్టడంతో రద్దీ ఏర్పడుతుంది.
- వచ్చిన భక్తులకు అత్యవసర సమయంలో మరుగుదొడ్లు సరిపడా లేవు. మొబైల్ మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలి.



దర్శనానికి రహదారిపై బారులు తీరిన భక్తులు (పాతచిత్రం)



రాజారావుకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా నాయకులు, సభ్యులు

అర్చకుల సమస్యలపై వినతి

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ధూపదీప నైవేద్యాల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి అర్చకుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.శ్రీనివాసరావు, ఎం.సంతోష్ కోరారు. కొత్తగా సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.రాజారావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. దేవాలయాల అభివృద్ధి, అర్చకుల సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపుతామని ఆయన హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలని ఎన్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని పీటీ మండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో జిల్లేడు ద్రావణం తయారు చేయించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా సహజ సిద్ధంగా లభించే వనరులు వినియోగించి ద్రావణాలు తయారు చేయాలన్నారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..

www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

కల్తీ కాగుతోంది..!

- యథేచ్ఛగా నాణ్యత లేని నెయ్యి, నూనెల వ్యాపారం
- ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నా పట్టించుకోని యంత్రాంగం

– న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

ప్రస్తుతం ఇంటా బయటా నెయ్యి, నూనెల వినియోగం తప్పనిసరి అయిపోయింది. ఇదే అదనుగా భావించి కొందరు యథేచ్ఛగా వాటిని కల్తీ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. అయినా అధికారులు కన్నెత్తి చూడట్లేదు. సిబ్బంది కొరత ఉందని.. ప్రయోగశాలలు లేవని కుంటిసాకులు చెబుతూ కాలం గడిపేస్తున్నారు. తాజాగా పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం అంశం తెరపైకి వచ్చిన తర్వాత మన దగ్గర పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉదయిస్తోంది. జిల్లాలోనూ నాణ్యత లేని నెయ్యి, నూనెల వాడకం విచ్చలవిడిగా జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



అధికశాతం రెండో రకమే..



నెయ్యి రెండు రకాలుగా ఉత్పత్తి చేస్తారు. ఇళ్లలో పెరుగు చిలికే క్రమంలో వచ్చే వెన్నను కాయడం ద్వారా తయారు చేసేది 10 నెలలైనా స్వచ్ఛంగా ఉంటుంది. యంత్రంలో పాలు పోసి ఆడించిన తర్వాత వచ్చే వెన్నను మరిగించి రెండో రకం చేస్తారు. దాని నాణ్యత నెల రోజుల తర్వాత తగ్గిపోతుంది. జిల్లాలో అత్యధికంగా రెండో రకం నెయ్యి అమ్మకాలు, వినియోగమే జరుగుతోంది. అందులోనూ వనస్పతి, పామాయిల్ కలిపేసి కొందరు కల్తీ చేస్తున్నారు. పెద్దఎత్తున కొనుగోలు చేసే మిఠాయిలు, ప్రత్యేక వంటకాల తయారీదారులు కల్తీ సరకుపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో నెలకు సుమారుగా 50 వేల లీటర్ల నెయ్యి విక్రయాలు జరుగుతుంటాయని వ్యాపారవర్గాల అంచనా. రకం, నాణ్యత బట్టి కిలో రూ.350 నుంచి రూ.1,000 వరకు అమ్ముతుండగా.. రూ.2.50 కోట్ల మేర వ్యాపారం అవుతోంది.

ధరే కాదు నాణ్యతా తక్కువే..



జిల్లాలో ఎక్కువగా సన్ ఫ్లవర్, పామాయిల్, రైస్‌బ్రాన్, వేరుశెనగనూనెలను ఎక్కువగా వాడుతుంటారు. అన్నీ కలిపి నెలకు దాదాపుగా 1,700 టన్నుల నూనె విక్రయాలు జరుగుతున్నాయి. అందులో చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో అధికంగా పామాయిల్, సన్ ఫ్లవర్ నూనెలనే వాడుతున్నారు. మిగిలిన వాటి కంటే తక్కువ ధరకు లభిస్తుండటంతో ఓ వర్గం వ్యాపారులతో పాటు సామాన్య, మధ్యతరగతి ప్రజలూ వీటికే మొగ్గు చూపుతున్నారు. నెలకు సుమారుగా రూ.15 కోట్ల మేర నూనె అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం.

వేలల్లో వ్యాపారులు.. ఇద్దరే అధికారులు..

జిల్లా కేంద్రంలోనే తోపుడు బండ్లు, చిన్న, మధ్యతరహా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు సుమారు వెయ్యి వరకు ఉన్నాయి. 30 మండలాల్లో ఆ సంఖ్య 10 వేల వరకు ఉండొచ్చని అంచనా. నెయ్యి, నూనెల సరఫరాదారులు 500 మంది ఉంటారు. వీరందరి వద్దా కల్తీ జరగకుండా ఇన్‌స్పెక్టర్‌స్థాయి అధికారులు మాత్రం ఇద్దరే కనిపిస్తున్నారు. ఫలితంగా ఎక్కడా తనిఖీలు సవ్యంగా జరగట్లేదు. వ్యాపారులకు అధికారులొస్తారనే భయం కూడా లేకుండా పోయింది.

క్యాన్సర్‌తో పాటు జీర్ణ సమస్యలు..

కల్తీ నెయ్యి, నూనెలతో చేసిన పదార్థాలు తింటే క్యాన్సర్‌తో పాటు జీర్ణకోశ రుగ్మతల బారిన పడే ప్రమాదముంది. వీటికి అదనంగా మలబద్ధకం, ఒళ్లు నొప్పులు, గుండె పోటు, పక్షవాతం వంటి సమస్యలుకూ ఆస్కారం ఏర్పడుతుంది. జీర్ణ వ్యవస్థ గాడి తప్పుతుంది. ఆరోగ్యం పాడయ్యాక రూ.లక్షలు ఖర్చు చేసే బదులు ముందే మేల్కోవడం మంచిది. – వండాన కిరణ్‌కుమార్, వైద్య నిపుణుడు, శ్రీకాకుళం

అనుమానం వస్తే ఫిర్యాదు చేయండి..

నాణ్యమైన నెయ్యి చిన్న పూసల మాదిరిగా ఉండాలి. అలా లేకుంటే నాణ్యత తగ్గినట్లు అనుమానించవచ్చు. ఇలా నూనెతో పాటు ఇతర ఆహార పదార్థాలు కల్తీ అయ్యాయని సందేహం ఉంటే శ్రీకాకుళం నగరం మండల వీధిలోని ఆహార భద్రతా అధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు. వెంటనే నమూనాలను ప్రయోగశాలకు పరీక్షలకు పంపిస్తాం. కల్తీ అని తేలితే చర్యలు తీసుకుంటాం. – కె.వెంకటరత్నం, జిల్లా ఆహార భద్రతాధికారి, శ్రీకాకుళం

ఆహార పదార్థాల కల్తీ ఫిర్యాదులకు సంప్రదించాల్సిన నంబరు: 97040 09989

చిట్టి చేతులు.. చక్కటి ఆకృతులు!

సారవకోట, న్యూస్‌టుడే

నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు తమలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలుగులోకి తెస్తున్నారు. ఒకరికొకరు పోటీపడి అబ్బురపరిచే ఆకృతులు తీర్చిదిద్దుతున్నారు. ఆకర్షణీయమైన వస్తువులు, పరికరాలు తయారు చేస్తున్నారు. సారవకోట మండలం బుడితి ఉన్నత పాఠశాల విద్యార్థుల కళా ప్రదర్శనపై 'న్యూస్‌టుడే' కథనం.



విద్యార్థులు తయారుచేసిన ఆకృతుల్లో కొన్ని

ఈ పాఠశాలలో 460 మంది విద్యార్థులు చదువుతున్నారు. పదేళ్ల నుంచి క్రాఫ్ట్ ఉపాధ్యాయుడిగా ఎర్ర ఆనందరావు పని చేస్తున్నారు. పిల్లలకు వివిధ ఆకృతులతో అల్లికలు, బొమ్మలు, పూల దండల తయారీ నేర్పిస్తున్నారు. భవిష్యత్తులో ఉపాధి లభించే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఈ ఏడాది జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఏర్పాటు చేసిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ స్టాల్‌లో ఇక్కడి విద్యార్థులు తయారు చేసిన పలు రకాల బొమ్మలు, పూలదండలు, పుష్పగుచ్ఛాలు వంటివి ఉంచారు. గోధుమ పిండి, కాగితాలు, తీగలు వినియోగించి తయారు చేసిన దుప్పి బొమ్మకు రంగులు వేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ బొమ్మతో పాటు ఈఫిల్ టవర్, అయోధ్య రామ మందిరం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి.



వ్యర్థాలతో రూపకల్పన..

పనికి రాని వస్తువులు, కాగితాలు, వస్త్రాలు, తీగలు, వెదురు, చీపురు పుల్లలు, దూది, అట్టలు, ఊలు, గోధుమ, బియ్యం గింజలు వంటివి ఉపయోగించి బొమ్మలు, గిఫ్ట్ ఆర్టికల్స్, పూలకుండీలు, దీపపు కాంతులతో ఈఫిల్ టవర్, క్రిస్మస్ తాత, వాల్ హ్యాంగర్లు, ఏంజిల్ బొమ్మ, పూలదండలు, రాఖీలు, పుష్పగుచ్ఛాలు, చెవి రింగులు, గృహ అలంకార వస్తువులు, పెన్సిల్ తొక్కుతో నెమలి, చిలుక వంటి పక్షుల తయారీ నేర్పిస్తున్నారు. చీపురు పుల్లలతో గణపతి చిత్రాన్ని రూపొందించారు. దారపు ఉండల్లో ఉండే కాగితపు రోల్స్‌ను ఉపయోగించి అయోధ్య రామ మందిరాన్ని తయారు చేశారు. మట్టితో 50 వరకు వినాయక విగ్రహాలు తీర్చిదిద్దారు. ఒక్కోటి రూ.10 చొప్పున విక్రయించారు. రాఖీలూ అమ్మారు. ఆలయాలు, దుకాణాల అలంకరణలకు దండలు తయారు చేయించి విక్రయించేలా చేస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందిస్తున్నారు.

పట్టు సాధించారు..

6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు బొమ్మల తయారీ, అల్లికలు నేర్పిస్తున్నాను. ఇప్పటికే చాలా మంది పట్టు సాధించారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల్లో 70 మంది వరకు అవలీలగా తయారు చేస్తున్నారు. కొందరు ఇళ్లలో తయారు చేసి సొంతానికి వినియోగిస్తుండగా.. మరికొందరు విక్రయిస్తున్నారు. పాఠశాలలో తయారు చేసిన విగ్రహాలు, బొమ్మలు ఉపాధ్యాయులు, విద్యార్థులు కొనుగోలు చేస్తుంటారు. వచ్చిన మొత్తాన్ని తిరిగి బొమ్మల తయారీకి పెట్టుబడిగా వినియోగిస్తుంటాం. పాఠశాల విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవం నాడు శ్రీకాకుళంలో ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకుంది. నాకు ఉత్తమ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడిగా గుర్తించి డీఈవో ప్రశంసాపత్రం అందజేశారు.

– ఎర్ర ఆనందరావు, క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు



బొమ్మల తయారీ నేర్పిస్తున్న ఉపాధ్యాయుడు ఆనందరావు

బొమ్మలు తయారు చేస్తా..

మూడేళ్లుగా బొమ్మల తయారీ నేర్చుకున్నా. ఎలాంటి బొమ్మనైనా తయారు చేయగలనన్న నమ్మకం కలిగింది. తీరిక సమయంలో ఈ పని చేస్తుంటా. బంధువులు, సమీపంలో ఉంటున్న వారు వారి ఇళ్లకు తీసుకెళ్తుంటారు. నా దగ్గర బొమ్మల తయారీ నేర్చుకోవడానికి గ్రామానికి చెందిన కొందరు ఆసక్తి కనబరచడం ఆనందాన్నిస్తోంది.

– రామకృష్ణ, విద్యార్థి, చీడిపూడి

అబ్బురపరుస్తున్నాయి..

విద్యార్థులు తయారు చేస్తున్న బొమ్మలు, వస్తువులు అబ్బురపరుస్తున్నాయి. ఉపాధ్యాయుడు ఆనందరావుకు క్రాఫ్ట్ విభాగంలో జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కడం ఆనందాన్ని కలిగించింది. పత్తితో ఒత్తుల తయారీ నేర్పించి టోకుగా విక్రయించాలని నిర్ణయించాం. – బి.మాధవరావు, హెచ్‌ఎం ఉన్నత పాఠశాల, బుడితి

శ్రమదానంతో గోతుల పూడ్చివేత



పార్వతీపురం శివారు మార్కెట్ యార్డు, డంపింగ్ యార్డు, సూర్యపీఠం సమీప రహదారి గోతులతో అధ్వానంగా మారింది. ఇటీవల వర్షాలతో నీరు నిలిచి చోదకులు అదుపు తప్పుతున్నారు. ఇక్కడ సమస్యను గుర్తించిన ఏఎంవీ ఇన్‌స్పెక్టర్ రమేష్, కంచర, గడి వీధులకు చెందిన యువత శ్రమదానం చేశారు. నిడగల్లు నుంచి పిక్కరాయి తీసుకువచ్చి గోతులను తాత్కాలికంగా పూడ్చారు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్ ప్రాంగణం

సీతంపేటలో విలువిద్య ఎంపికలు

సీతంపేట, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విలువిద్య (ఆర్చరీ) ఎంపికలు అక్టోబర్ 1 నుంచి నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, క్రీడల అధికారి ఎన్.జాకోబ్‌దయానందం తెలిపారు. సీతంపేటలోని ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ మైదానంలో ఉదయం 9 గంటలకు అండర్ 14, 17, 19 విభాగాల్లో ఎంపికలు ప్రారంభం అవుతాయన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని బాలురు, బాలికలు అర్హులని తెలిపారు.